సాక్షి తిరుపతి

శనివారం । 23 । సెప్టెంబర్ । 2023



ట్రక్ బోల్తా

రాపూరు మండలం. బొజ్జనపల్లె వద్ద శుక్రవారం కల్వర్ట్ ఢీకొని ట్రక్ బోల్తా పడడంతో డ్రైవర్ గాయపడ్డాడు. - 8లో



వరసిద్ధుడికి వి'శేష' సేవలు

కాణిపాకం బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. వరసిద్ధుడు చిన్న, పెద్ద శేషవాహనాలపై విహరించారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	33	24
చిత్తూరు	34	24
తిరుమల	29	20
గూడూరు	36	26
నగరి	35	25

న్యూస్‌రీల్

జాతరకు ఆహ్వానం



సీఎంకు వెంకటగిరి పోలేరమ్మతల్లి చిత్రపటాన్ని బహూకరిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్: వెంకటగిరిలో అక్టోబర్ 4, 5 తేదీలలో జరగనున్న పోలేరమ్మ తల్లి జాతరకు విచ్చేయాలని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ మేరకు శుక్రవారం తాడేపల్లె సీఎం క్యాంప్ ఆఫీసులో ముఖ్యమంత్రిని కలిసిన ఆయన పోలేరమ్మ తల్లి చిత్రపటాన్ని బహూకరించారు.

జిల్లాలో అదనంగా 26 పోలింగ్ కేంద్రాలు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: జిల్లాలో అదనంగా మరో 26 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన రాజకీయ పార్టీల నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1,400 ఓటర్లకంటే అధికంగా ఉన్న ప్రాంతంలో అదనంగా మరో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే 2కి.మీ మించి దూరం ఉంటే ఆ ప్రాంతంలోనూ మరో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. పలు పోలింగ్ కేంద్రాల భవనాల పేర్లు మార్పు చేయడం, శిథిలమైన భవనాల్లో కాకుండా సమీపంలోని భవనాలకు మార్పు చేయడం, 20 చ.మీ కన్నా తక్కువ స్థలం ఉన్న పోలింగ్ కేంద్రాలను మార్పు చేయనున్నట్టు ఆయన వెల్లడించారు. సమావేశంలో నగరపాలక కమిషనర్ హరిత, డీఆర్వో పెంచల కిషోర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఆర్డీఓ కనకనరసారెడ్డి, చంద్రముని, రామారావు, కిరణ్‌కుమార్, ఎన్నికల తహసీల్దార్ రమేష్ పాల్గొన్నారు.

కరెన్సీ వినాయకుడు



పలమనేరు: పట్టణంలోని చిన్నగాండ్లవీధిలో ఏర్పా టు చేసిన వినాయక స్వామివారికి విశేషంగా పూ జలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో నిర్వాహకు లు ఐదో రోజైన శుక్రవారం స్వామివారి విగ్రహం చుట్టూ రూ. 20 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఇలా ఐదు రోజులుగా వివిధ రకాల అలంకరణలో వినాయకస్వామివారు భక్తులను కటాక్షిస్తున్నారు.

సాంస్కృతిక వేడుకల్లో టీటీడీ చైర్మన్ భూమన, ఈఓ



మోహినీ అలంకరణలో.. తిరుచ్చిపై శ్రీకృష్ణుడు





కళాకారులతో మంత్రి ఆర్కే రోజా





గరుడ వాహనంపై మలయప్ప

గరుడ గోవిందం

ఇల వైకుంఠంగా విరాజిల్లుతున్న తిరుమలకు భక్తులు పోటెత్తారు. శుక్రవారం రాత్రి జరిగిన గరుడ సేవకు తండోపతండాలుగా తరలివచ్చారు. పక్షిరాజుపై విహరిస్తున్న పరమాత్ముడిని దర్శించి పునీతులయ్యారు. కర్పూర హారతులు సమర్పించి ఆధ్యాత్మికానందంలో మునిగితేలారు. ఉదయం జగద్రక్షకుడైన శ్రీ వేంకటేశ్వరుడు మోహినీ రూపంలో దంత పల్లకీపై శృంగార సారధి దేవతగా, పక్కనే వెన్న ముద్ద చేతబట్టిన చిన్నికృష్ణుడితో కలిసి హోయలొలుకుతూ భక్తకోటిని అనుగ్రహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ.ధర్మారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- గరుడ సేవకు పోటెత్తిన భక్తులు
- కిక్కిరిసిన తిరుమాడ వీధులు
- ఏర్పాట్లు పర్యవేక్షించిన టీటీడీ చైర్మన్, ఈఓ

తిరుమల: తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఐదో రోజు శుక్రవారం రాత్రి గరుడ వాహనంపై విహరిస్తూ మలయప్ప భక్తులను సాక్షాత్కరించారు. ఉత్సవమూర్తిని ప్రతి ఒక్కరూ దర్శించుకునేలా వాహనాన్ని అటూఇటూ తిప్పుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు అధికంగా నిరీక్షించే ప్రాంతాల్లో హారతులతో కూడిన దర్శనం కల్పించారు. కూడళ్లలో ఎక్కువ సమయం వాహనాన్ని నిలిపి సాధ్యమైనంత ఎక్కువ మంది భక్తులకు దర్శనం కల్పించటంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి సఫలీకృతులయ్యారు. ఉదయం మలయప్ప స్వామి మోహినీ రూపంలో దంత పల్లకీపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. గరుడ వాహన సేవను చూసి తరించడానికి భక్తులు ఉదయం నుంచే పెద్ద ఎత్తున తరలివచ్చారు. గ్యాలరీల్లో వేచి ఉన్న భక్తులకు జలప్రసాదం, పులిహోర, ఉప్మా, సాంబరన్నం, ఇతర అన్నప్రసాదాల ప్యాకెట్లు, పాలు, తేనీరు సరఫరా చేశారు. పారిశుద్ధ్యంపై ఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టికనబరిచింది. ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.



జయ కృష్ణా ముకుందా మురారి



కళా బ్రహ్మోత్సవం



నమస్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



గరుడోత్సవానికి విచ్చేసిన అశేష భక్తజనం

కిటకిటలాడిన తిరుపతి బస్టాండ్

తిరుపతి అర్బన్: తిరుమల శ్రీవారి గరుడోత్సవం సందర్భంగా శుక్రవారం తిరుపతి బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు సెంట్రల్ బస్టాండ్‌తోపాటు అలిపిరి బాలాజీ బస్టాండ్ తదితర ప్రాంతాలను పర్యవేక్షించారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు తిరుపతి- తిరుమల మధ్య 58,888 మంది భక్తులు, 3 గంటలకు 65,089 మందిని, 4 గంటలకు 71,881 మంది, 5 గంటలకు 79,966 మంది రాకపోకలు సాగించారు.



ఏడుకొండల బస్టాండ్‌లో భక్తుల రద్దీ

శుక్రవారం రాత్రికి 1.5 లక్షల మంది భక్తులకు ఆర్టీసీ సేవలు అందించినట్టు అధికారులు తెలిపారు.

25 నుంచి పవిత్రోత్సవాలు



నగలు సరిచూస్తున్న ఈఓ సాగర్‌బాబు, సిబ్బంది

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 25 నుంచి పవిత్రోత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఈఓ సాగర్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం బ్యాంకు లాకర్‌లో భద్రపరిచిన స్వామి, అమ్మవార్ల నగలను బయటకు తీసి పరిశీలించారు. ఉత్సవాల అనంతరం తిరిగి లాకర్‌లో భద్రపరచనున్నట్లు తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 66,462 మంది స్వామివారిని దర్శించుకోగా 29,241 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 2.77 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ప్రభుత్వ విద్యాసంస్థలకు శ్రీసిటీ ఫౌండేషన్ చేయూత


పాఠశాలలకు అందజేసిన డెస్క్‌టాప్ కంప్యూటర్లు

సత్యవేడు: ప్రభుత్వ పాఠశాలలు, విద్యాసంస్థలకు శ్రీసిటీ ఫౌండేషన్ చేయూతనందించింది. శుక్రవారం నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రూ.25 లక్షల విలువచేసే 30 డెస్క్‌టాప్ కంప్యూటర్లు, 25 పోడియంలను టీహెచ్‌కే కంపెనీ వితరణగా అందజేసింది. కంపెనీ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ మకటో సాడో వాటిని లాంఛనంగా ప్రారంభించారు. తమ సీఎస్సార్ నిధులతో విద్యాసంస్థల బలోపేతానికి మరింత కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎం సుందరవల్లి అభినందనలు తెలిపారు. పరిశ్రమల సీఎస్సార్ నిధులతో విద్యాసంస్థలకు వసతుల కల్పనలో కీలక పాత్ర పోషించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే హంటర్ డగ్లస్ కంపెనీ సత్యవేడు ప్రభుత్వ జూనియర్‌కళాశాలకు ప్రింటర్లు, ఇరుగుళం, మాధనపాళెంకు స్మార్ట్ బోర్డులు, తడ, సూళ్లూరుపేట హైస్కూళ్లకు సుమారు రూ.6.5 లక్షల విలువైన స్మార్ట్ డిస్‌ప్లే బోర్డులు, ప్రింటర్లను వితరణగా అందజేసింది. హంటర్ డగ్లస్ ఫ్యాక్టరీ హెడ్ తమిలళగన్ స్మార్ట్ బోర్డులను ప్రారంభించారు.

శ్రీకాళహస్తీశ్వరుని సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి


గురుదక్షిణామూర్తి సన్నిధిలో జస్టిస్ రామకృష్ణ

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శుక్రవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జీ.రామకృష్ణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనాలు అందించగా.. అధికారులు స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో 12వ అడిషనల్ జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసులునాయక్, శ్రీకాళహస్తి న్యాయమూర్తులు బేబీరాణి, కృష్ణప్రియ, సీఐ అంజుయాదవ్ పాల్గొన్నారు.

వరసిద్ధుడికి విశేష సేవలు

గజగమనా.. గరిక ప్రియా.. ఉమాతనయా.. ఏకదంతా.. వక్రతుండా.. వర అభయా.. వీర విఘ్నేశా.. మా హారతులందుకో.. మమ్ము కరుణించు.. కరివదనా.. అని భక్తులు వరసిద్ధుడిని చిన్న, పెద్ద శేషవాహన సేవల్లో భక్తిశ్రద్ధలతో కొలిచారు.



శత క్షీర కలశాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు, చిన్న శేషవాహనంపై వరసిద్ధి వినాయకస్వామివారు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సిద్ధి, బుద్ధి, సమేత వరసిద్ధుడు చిన్న, పెద్ద శేషవాహనాలపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వేకువజామున మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకం, అలంకరణ, అర్చన, ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. ప్రధాన ఆలయం, స్వర్ణ ధ్వజస్తంభం, సుపథ మండపాన్ని సుగంధభరిత పుష్పాలతో శోభయమానంగా అలంకరించారు. అనంతరం ఉభయకర్తల ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు అభిషేకం, అలంకరణ, పూజలు నిర్వహించి, ఉభయకర్తలకు ప్రత్యేక దర్శనం కల్పించారు. అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత గౌరీ సుతునికి విశేషాలంకరణ చేసి, చిన్న శేష వాహనంలో కొలువుదీర్చారు. మేళతాళాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ పురవీధుల్లో వాహనసేవ జరిపారు.

కనుల పండువగా పెద్ద శేషవాహనం

రాత్రి అలంకార మండపంలో అర్చకులు సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామివారికి సుగంధభరిత పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. ఉభయకర్తలు, ఆలయ అధికారులు ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకొచ్చి బంగారు పెద్ద శేష వాహనంలో కొలువుతీర్చారు. ప్రత్యేక పూజల అనంతరం మంగళ వాయిద్యాలు, కోలాటాలు, చెక్క భజనల నడుమ పెద్దశేష వాహన సేవ నిర్వహించారు. పూజలకు కాణిపాకం, కాకర్ల వారిపల్లె, వడ్రాంపల్లె, మిట్టఇండ్లు, కొత్తపల్లె, అడపగుండ్లపల్లె, బొమ్మసముద్రం, తిమ్మోజిపల్లె, తిరువణంపల్లె, చిగరపల్లె, అగరంపల్లెకు చెందిన కమ్మ సామాజిక వర్గీయులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

వైభవం.. శత కలశ క్షీరాభిషేకం

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారికి ఉభయకర్తల ఆధ్వర్యంలో శత కలశ క్షీరాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి అనుబంధ ఆలయం నుంచి ఉభయకర్తలు, వారి కుటుంబసభ్యులు శత క్షీర కలశాలను మేళతాళాలు, కేరళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆలయ కల్యాణ వేదికలో కొలువదీర్చిన సిద్ధి, బుద్ధి, సమేత వినాయక స్వామివారి విగ్రహాలకు ఆలయ అర్చకులు శేఖర్ స్వామి ఆధ్వర్యంలో క్షీర, గంధ, పంచామృత అభిషేకాలు నిర్వహించి, పూజలు చే శారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ మణి నాయుడు, మాజీ సర్పంచ్ మధుసూదన్, ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.

నేడు వృషభ వాహన సేవ

కాణిపాకం బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారు వృషభవాహనంలో ఊరేగనున్నారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, అర్చన, పూజలు నిర్వహించనున్నారు.


పెద్ద శేషవాహనంపై స్వామివారు

అద్భుతంగా నెమలిపింఛ వినాయకుడు

- స్వామి సన్నిధిలో ఇస్కాన్ అంతర్జాతీయ అధ్యక్షుడు
- పూర్ణకుంభ స్వాగతం పలికిన ప్రభుత్వ విప్ చెవిరెడ్డి


ఇస్కాన్ అంతర్జాతీయ అధ్యక్షుడు రేవతిరమణదాస్ దంపతులతో ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్: ఇస్కాన్ అంతర్జాతీయ అధ్యక్షుడు రేవతీ రమణదాస్ దంపతులు శుక్రవారం నెమలిపింఛ వినాయకున్ని దర్శించుకున్నారు. కల్యాణ వెంకన్న ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామంలో జరిగే శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో గరుడసేవకు హాజరయ్యారు. అంతకుముందు స్వామి వారికి సారె సమర్పించారు. ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నెమలిపింఛ వినాయక విగ్రహాన్ని దర్శించారు. విగ్రహాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారని కొనియాడారు.

నేటి నుంచి సైన్స్ సెంటర్ వార్షికోత్సవాలు

తిరుపతి కల్చరల్: రీజనల్ సైన్స్ సెంటర్ 30వ వార్షికోత్సవాన్ని శనివారం నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు సైన్స్ సెంటర్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ ఒక ప్రకటనలో తెలిపారు. 1993 సెప్టెంబర్ 23న సైన్స్ సెంటర్ ప్రారంభమైందని తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్రం పునరుద్ధరించిన హెర్బల్ గార్డెన్‌తో పాటు కేంద్రం ఒక వార్షికోత్సవ పోస్టల్ స్టాంప్, సైన్స్ క్విజ్ పోటీని, కొత్త సైన్స్ షోను విద్యార్థుల కోసం ప్రారంభించనున్నట్లు తెలిపారు. శనివారం హెర్బల్ గార్డెన్ ప్రారంభోత్సవం, ఆర్ఎస్‌సీ తిరుపతి వార్షికోత్సవ స్టాంప్ విడుదల, 24న సాయంత్రం 4 గంటలకు సైన్స్ షో, 25న ఉదయంసందర్శకుడికి రివార్డ్, 26న మధ్యాహ్నం 2 గంటలకు సైన్స్ అండ్ టెక్నాలజీ అనే అంశంపై ఇంటర్ స్కూల్ టీమ్‌వైజ్ సైన్స్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 27న మధ్యాహ్నం 2 గంటలకు ఓపెన్ హౌస్ సైన్స్ క్విజ్ పోటీ, అదే రోజు 3 గంటలకు బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని తెలిపారు.

ఆర్టీసీ బస్సులకే అనుమతి


బస్టాండ్ వైపునకు దిగుతున్న ఇతర వాహనాలు

తిరుపతి అర్బన్: శ్రీనివాస సేతు బ్రిడ్జి నుంచి ఆర్టీసీ బస్టాండ్‌లోకి ఏర్పాటుచేసిన మార్గంలో ఆర్టీసీ బస్సులకు మాత్రమే అనుమతి ఉందని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. ద్విచక్ర, మూడు, నాలుగు చక్రాల వాహనాలు వస్తుండడంతో ఆర్టీసీ సర్వీసులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉందని తెలిపారు. మిగతా ప్రాంతాల్లో అన్ని వాహనాలు శ్రీనివాస సేతుపై వెళ్లడానికి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు.

25న హ్యాండ్ బాల్ పోటీలకు జట్ల ఎంపిక


రమణయ్య ప్రధానోపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 25న రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జట్లు ఎంపిక చేయనున్నట్టు హెచ్‌ఎం రమణయ్య తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని మండలాల నుంచి 400 మంది క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొంటారని, వీరిని 50 మందిని ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైన వారు ఈనెల 29వ తేదీన తెనాలిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని ఆయన వివరించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


నారాయణమ్మ మృత దేహం వద్ద క్లూస్ టీమ్

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం, కరాపేటలో అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. భాకరాపేట ఇన్చార్జి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం.. భాకరాపేట టీచర్స్ కాలనీకి చెందిన సాకిరి నారాయణమ్మ (80) గురువారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందింది. స్థానికులు భాకరాపేట పోలీసులుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. మృతురాలి భర్త, కుమారుడు కొన్నాళ్ల క్రితం చనిపోయారు. మృతురాలి శరీరంపై ఉన్న బంగారు నగలు కనిపించడం లేదని ఆమె కుమార్తె నాగరాజ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు

– ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో గాయపడ్డ శ్రీవాణి, రంగారావు

నాయుడుపేట టౌన్: మండలంలోని నరసారెడ్డికండ్రిగ గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల కథనం.. పట్టణంలోని జైహింద్ కాలనీకి చెందిన బేల్దారి కార్మికుడు పోట్లూరు రంగారావు, మరో కార్మికురాలు శ్రీవాణి బైక్‌లో నరసారెడ్డికండ్రిగ జాతీయ రహదారి కూడలి వద్ద రోడ్డు దాటుతున్నారు. అదే సమయంలో చెన్నై నుంచి గూడూరు వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న రంగారావు, శ్రీవాణికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ కృష్ణయ్య ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ట్రక్ బోల్తా : డ్రైవర్‌కు గాయాలు

రాపూరు : మండలంలోని బొజ్జనపల్లె వద్ద శుక్రవారం కల్వర్ట్ ఢీకొని ట్రక్ బోల్తా పడడంతో డ్రైవర్ గాయపడ్డాడు. నెల్లూరు రామకోటయ్యనగర్‌కు చెందిన నాగేశ్వర్‌రెడ్డి ట్రక్‌లో అద్దెకు బెంగళూరుకు వెళ్లి వస్తుండగా అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. ట్రక్ ధ్వంసం కాగా నాగేశ్వరరెడ్డికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని రాపూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆటోమోటీవ్ మ్యానుఫ్యాక్చరర్స్ సర్వీస్ సెంటర్ ప్రారంభం


అశోక్ లేలాండ్ సర్వీస్ సెంటరును ప్రారంభిస్తున్న శివప్రసాద్‌రెడ్డి

రేణిగుంట: రేణిగుంట కేఎల్‌ఎం ఆస్పత్రి కూడలి వద్ద శుక్రవారం ఆటోమోటీవ్ మ్యానుఫాక్చరర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అశోక్ లేలాండ్ 8బే వర్క్‌షాప్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆటోమోటీవ్ మ్యానుఫ్యాక్చరర్స్ ఈడీ రాజీవ్ సంఘ్వి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అతిపెద్ద కమర్షియల్ వెహికల్ వర్క్‌షాపును ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. దేశంలోని ఆరు రాష్ట్రాల్లో 104 సర్వీస్ టచ్ పాయింట్లు ఉన్నట్లు తెలిపారు. అశోక్ లేలాండ్ డీలర్ నెట్వర్క్‌లో తమ సంస్థ అతి పెద్దదన్నారు. టిప్పర్లు, ట్రావెల్ బస్సులు, ఐసీవీ గూడ్స్ వాహనాలకు 24గంటలు సేవలను ఈ సెంటర్ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. మాజీ డీసీసీబీ చైర్మన్ సిద్ధాగుంట సుధాకర్‌రెడ్డి, ఆటోమోటీవ్ బ్రాంచి మేనేజర్ శివప్రసాద్‌రెడ్డి, అశోక్ లేలాండ్ ఏరియా మేనేజర్ రఘునాథ్, ఏపీ సర్వీస్ హెడ్ రమేష్, రీజనల్ సర్వీస్ మేనేజర్ దుర్గాప్రసాద్, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రాప్లింగ్ జిల్లా జట్ల ఎంపిక


ఎంపికైన బాలబాలికలతో జిల్లా చీఫ్ కోచ్, గ్రాప్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో శుక్రవారం గ్రాప్లింగ్ జూనియర్, సీనియర్ జిల్లా జట్లను ఎంపిక చేశారు. రాష్ట్ర గ్రాప్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపిక పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి జూనియర్, సీనియర్ కేటగిరిలో బాలబాలికలు హాజరయ్యారు. వీరికి వేర్వేరుగా పోటీలు నిర్వహించి, ప్రతిభకనబరిచిన 30 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు గ్రాప్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సురేంద్రారెడ్డి తెలిపారు. జిల్లా జట్లుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 23, 24 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించనున్న 3వ రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్ పోటీల్లో జిల్లా తరపున పాల్గొంటారన్నారు. క్రీడాకారులను జిల్లా చీఫ్ కోచ్ సయ్యద్ సాహెబ్ అభినందించారు. ఈ పోటీలకు డీ.సాయి సుమతి న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.

కోడలే చంపించింది!

- పశ్చిమ బెంగాల్ ప్రాంతానికి చెందిన ఓ తండ్రి ఆవేదన


నాయుడుపేట పోలీస్‌స్టేషన్‌లో మృతుడి తండ్రి, కుటుంబ సభ్యులు

నాయుడుపేటటౌన్: 'నా కోడలు వేరొకరితో సంబంధం పెట్టుకుని, పథకం ప్రకారం నా కొడుకుని హత్య చేయించింది' అని పశ్చిమబెంగాల్ ప్రాంతానికి చెందిన కార్తిక్ మండల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక పోలీసులను కలిసి వివరాలు వెల్లడించారు. వివరాలు.. ఈనెల 1వ తేదీ అర్ధరాత్రి మేనకూరు సెజ్ పరిధిలోని లాయల్ టెక్స్‌టైల్స్ పరిశ్రమలో పనిచేస్తున్న చరణ్ జిత్ మండల్ (31) హాస్టల్ మిద్దెపై నుంచి పడి ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ సంఘటనపై ఈనెల 2వ తేదీ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న మృతుడి తండ్రి కార్తిక్ మండల్ పశ్చిమబెంగాల్ నుంచి అతని కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం నాయుడుపేట పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. తన కుమారుడి మృతికి ప్రధాన కారకురాలు కోడలు, ఆమె కుటుంబ సభ్యులేనని ఎస్‌ఐ వేణుకు విన్నవించారు. మరో వ్యక్తితో సంబంధం పెట్టుకుని ఇంటి నుంచి వెళ్లిపోయిందని, ఆపై నగదు కోసం మానసికంగా తన కుమారుడిని వేధించి చంపించిందని తెలిపారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌కు శరణ్య


విద్యార్థిని శరణ్యకు బహుమతి అందజేస్తున్న ప్రొఫెసర్ సుచరిత

తిరుపతి ఎడ్యుకేషన్ : విజయవాడలో 25న నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌కు ఓజిలి మండలం, అరిమెనిపాడు జెడ్పీహెచ్‌ఎస్ పదో తరగతి విద్యార్థిని కె.శరణ్య ఎంపికైంది. తిరుపతిలోని ఎస్వీయూ క్యాంపస్ స్కూల్లో శుక్రవారం చిరుధాన్యాల ఆవశ్యకతపై జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాలను డీవైఈవో ఆనందరెడ్డి వివరించారు. అనంతరం చిరుధాన్యాల ఆవశ్యకతపై నిర్వహించిన పోటీల్లో కె.శరణ్య మొదటి స్థానం, వెంకటగిరిలోని ఏపీ మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థిని హర్షిత ద్వితీయ స్థానం, చంద్రగిరి బాలికల బీసీ సంక్షేమ పాఠశాల 8వ తరగతి విద్యార్థిని జ్యోత్స్న తృతీయ స్థానాన్ని సాధించారు. వీరికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్, ఎస్వీయూ ప్రొఫెసర్ సుచరిత, రాయలసీమ విద్యాసంస్థల అధినేత ఆనందరెడ్డి, క్యాంపస్ స్కూల్ హెచ్‌ఎం షకీన, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

ఎస్వీయూతో సుజన్ లైఫ్ ఒప్పందం


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ రాజారెడ్డి

తిరుపతి సిటీ: వెంకటేశ్వర విశ్వవిద్యాలయంతో సుజన్ లైఫ్ టైమ్స్ సంస్థ శుక్రవారం ఒప్పందం కుదుర్చుకుంది. వీసీ కె.రాజారెడ్డి ఆ సంస్థ ప్రతినిధులతో కలిసి ఒప్పంద పత్రాలు మార్చుకున్నా రు. ఆయన మాట్లడుతూ డ్రగ్స్ రీసర్చ్, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ రంగాల్లో లైఫ్‌టైమ్స్ సంస్థతో కలిసి పనిచేస్తామన్నారు. రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.